చేతులు వేసి మొహం ముందుకు పోనిచ్చి ఆయన పెదాలకు, పెదాలు తాకించి మృదువుగా ముద్దుపెట్టుకున్నారు.

అంతే — ఆ క్షణంలో

వేడిగా వున్న మంచుగడ్డ, మండుతున్న మల్లెపువ్వు, పొగలు క్రక్కే వెన్నెల కిరణాలు, విరిగిన ఇంద్రధనస్సు ముక్కలు, కాల్చివేసే కోరికల నవ్వులు, వర్షింపబోయే మేఘపు తునకలు, అన్నీ కలిపి అందమయిన కోమలి కామపుకోరికల కడగంటి చూపు వంటి మెత్తని కత్తిని తయారుచేసి దానితో సుతిమెత్తగా ఆయన పెదాలు చీరినట్టు, ఆ కాలం క్షణం ఆకారం దాల్చుకునే కాస్త సమయంలో, కాలచక్రం నిలిచి సృష్టి స్తంభించినట్లు, విరుచుకుపడే కెరటం ఒక్కసారిగా ఆగిపోయినట్లు, జలపాతం అంచు వద్ద క్రిందకి దుముకబోయి నీరు స్తంభించినట్లు, సౌందర్యం నగ్నంగా నృత్యం చేస్తూ హఠాత్తుగా ఆగినట్లు, గుండెలోకంటా బలంగా దింపబడిన కత్తిని బయటకి లాగుతోన్నట్లు, రక్తనాళాలు సాగి, పొంగి, బీట్లు పడి బద్దలయి వాటి నుంచి రక్తానికి బదులు సువాసనలు విరజిమ్మే వెన్నెల సోనలు వెలువడుతోన్నట్లు, శరీరం చిల్లులు పడి వాటి నుంచి సౌందర్య సుగంధధూమం బయలుదేరుతోన్నట్లు, అనేక ఏళ్ళ క్రితం మండి ఆరిపోయిన అగ్నిపర్వతం ఒక్కసారి మళ్ళీ మండి కోరికల లావాను వెలువరిస్తోన్నట్లు, మస్తిష్కం అరవబోయి మూగబోయినట్లు కొండ అంచు నుంచి జారిపడే మనిషి శూన్యంలో క్షణకాలం ఆధారం లేకుండా ఆగినట్టు, గుండె క్రొత్త పద్ధతిలో గట్టిగా కొట్టుకుంటూ ఒక్కసారి నిలచి కటక్ మన్నట్లు, భూమి తిరగటం మానివేసినట్లు, గ్రహాలు గతి తప్పినట్లు, సృష్టి రూపుమార్చుకున్నట్లు, మానవుడు మరణించినట్లు, ఏదో, ఏదేదో...

ఆ క్షణం అయిపోయింది, ఆమె వెళ్ళిపోయింది.

అటుపైన లైట్లు వెలిగాయి. అంతా సందడి — సరదా.

ఆ హాలులో ఆ ప్రక్కగా స్తంభానికి ఆనుకుని చైతన్య విహీనులయి జన్మరాహిత్యం పొందినట్లుగా నిలబడిపోయారు సుందరరామయ్యగారు. ఆయన అన్నివేపులా చూస్తున్నారు.

ఎవరామె? ఎవరామె? ఎలాగ తెలుసుకోవటం? తాను గుర్తించినదల్లా ఆమె పెదాలు పల్చగానూ, అల్పంగానూ, మంచు ముక్కల్లాగా, వెన్నెల మొరికలాగా మధురమయిన మెరపు తునకలాగా, మృదువుగా, తడిగా, సువాసనగా, చల్లగా, మెత్తగా, మత్తుగా, అంతే -- ఎవరామె? జరా భారంతో వున్న తనను, సౌందర్య విహీనుడయిన తనను వయసు విడాకులిచ్చిన తనను, ఆ విధంగా ఎండిన తన పెదాల మీద పదిలంగా తన పెదాలతో ముద్దును భద్రపరచుకున్న ముద్దరాలు ఎవరు?

హాలులో అందరివైపు చూస్తున్నారు ఆయన.

కొడుకు దగ్గర నిలుచుని అతని ఛాతీ మీద చేతితో రాస్తున్న ఆంగ్లో యిండియన్ అమ్మాయా, లేక ఆ ప్రక్క లావుపాటి వ్యక్తి ముందు నిలుచుని అతని కళ్లలోకంటా చూస్తున్న ఆ నన్నటి సుందరా, ఆవైపు బల్ల దగ్గర కూర్చుని ఆ కుర్రవాడు చెప్పేది వింటున్న పంజాబీ పిల్లా, ఆ నలుగురి మధ్యా నిషాగా నవ్వుతున్న తురకల అమ్మాయా (ఆ అమ్మాయి అయితే బాగుండును). లేక ఆ బెంగాలీ అమ్మాయా?

ఎవరు? ఎవరు? ఎవరు?

పార్టీ ముగిసింది. అతిథులు వెళ్ళిపోయారు. హాలు శూన్యమయింది. నిశ్శబ్దం అలుముకుంది. సుందరరామయ్యగారికి ఆ హాలు శ్మశానంలాగా నిశ్శబ్దంగాను, చావులా చల్లగానూ, చీకటిలా నల్లగాను అనిపిస్తోంది. మెల్లగా సుందరరామయ్య గారు తన గదిలోకి వెళ్ళిపోయారు.

మంచం మీద వెల్లకిలా పడుకున్నారు. కిటికీలోంచి వాలుగా మీదపడే వెన్నెల జాలు ద్వారా చంద్రుడిని అడుగుతున్నారాయన.

ఎవరామె? ఎవరామె? ఎవరామె?

అది వెన్నెలలోని చీకటి రహస్యంలాంటి ప్రశ్న. దానికి చంద్రుడే కాదు సృష్టిలోనే జవాబు లేదు... మరి జవాబు రాదు.

* * *

సాయంకాలం నుంచి తనలో కదిలిన గతం జ్ఞాపకాలు, అనుభవాల కోరికలు రగిల్చిన వేడి, వయసు మళ్ళిన కోరికల ఆఖరి తపన తాపత్రయం. అన్నీ కలిపి అందించిన ఉద్రేకం — వెన్నెలతో పొంగి హాలులోని నృత్యాలకు వాయిద్యాలకు ఉధృతంగా ఉప్పొంగి, విజృంభించగా, ఆగలేక, "తప్పు" అని తెలిసినా తప్పనిసరిగా హాలులోకి అడుగెట్టి ఎవరి పెదాల మీదో ముద్దు ఇచ్చిన ఆ పెదాల వ్యక్తి ఎవరు? అంటూ —

అదే రాత్రి వెన్నెల వెలుగు సోకని కిటికీగుండా తన పల్చటి పెదాలను స్పృశించే సమయంలో ఆలోచిస్తోంది—ఆ పెదాల హక్కుదారిణి అయిన ఆమె — ఆ యాభయ్ ఏళ్ళ మనిషి — సుందరరామయ్యగారి భార్య అనసూయాదేవి గారు...

(1967 మధ నుంచి)

## "శనిదానం"

శనివారం

ఆంజనేయ స్వామి గుడి భక్తులతో కిటకిట లాడుతూంది.

అంతకంటె ఎక్కువగా రావి చెట్టు కింద వున్న నవగ్రహాల ముందు జనం తోసుకుంటున్నారు.

నల్ల మినుములు, నువ్వులు, నూనె, శనీశ్వరుడి విగ్రహానికి అభిషేకం చేసి ఆ ఖాళీ సీసాలని అక్కడే పడేస్తున్నారు.

ప్రక్కనే మండపంలో కూర్చొన్న శాస్త్రి గారికి కూడా శక్తి కొద్దీ తిలదానం ఇచ్చి తృణమో పణమో దక్షిణ కూడా సమర్పించుకొని వెడుతున్నారు.

నిజానికి శనివారంనాడు అదీ... అలాంటి 'శని దానాలు' ఏ బ్రాహ్మణుడూ తీసుకోడు.

కాని శాస్త్రిగారిది పెద్ద కుటుంబం.

వేరే జరుగుబాటు లేక శని మంత్రం నేర్చుకొని ఆ విగ్రహాల ముందే కూర్చున్నాడు.

మిగతా విషయాల మాట ఎలా వున్నా ఆదాయం బాగానే వుంది.

ఇంతలో ఓ భక్తుడు - పేరు అప్పారావు- గభాల్న వచ్చి శాస్త్రి గారి కాళ్ళ మీద పడ్డాడు. "నన్ను శని పట్టుకుంది స్వామి. దాన్ని ఒదిలించుకుందుకు ఏదన్నా మంత్రం చెప్పండి" అంటూ గొల్లుమన్నాడు.

"ఇంతకీ అసలు విషయం ఏమిటి నాయనా! ముందు నా కాళ్ళు వదలండి. మీకు వచ్చిన కష్టం ఏమిటి? మిమ్మల్ని ఏలినాటి శని పట్టుకుందా... లేక పద్నాలుగేళ్ళ శని పట్టు..."

శాస్త్రిగారి నోటిమాట పూర్తి కానేలేదు.

అప్పారావు తల బాదుకున్నాడు.

"అయ్యో! నన్ను పట్టింది ఏలినాటి శని కాదు, పద్నాలుగేళ్ళ శని అసలే కాదు. ఏడేడు జన్మల శని స్వామీ! వద్దు వద్దంటున్నా వినకుండా మా నాన్న బలవంతాన మా అత్త కూతురు ఆండాళ్ళుతో నా పెళ్ళి జరిపించాడు. ఆ శని వదిలే మార్గం చెప్పండి" అంటూ లబ లబలాడాడు.

విషయం అర్థం అయిన శాస్త్రి గారు వేదాంతిలా నవ్వాడు.

"ఆ శని వదిలించుకునే మంత్రం తెలియకనే కదా నాయనా నేను ఈ 'శని' మంత్రం జపిస్తున్నాను" అన్నాడు తన గయ్యాళి భార్యని జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

– కాకాని కమల